# మాలతి

రచన :
శ్రీ డి. రామచంద్రము.

ఆదేవో ఇంగ్లీషు సినిమాకు మాలతీ, రామంలు కలిసి వెళ్ళారు. సినిమా వదలిపెట్టారు. జనగణమన అయిన తరువాత జనం బయటపడుతున్నారు తోసుకుంటూ.

రామం మాలతీ హాల్లోంచి లేచి బయటకు వచ్చారు. చల్లగాలి ఒంటికి తగిలి గిలిగింతలు పెడుతూంది ఇద్దరినీ.

ఆ మసక చీకటిలో రామంను ఆనుకొని మాలతీ వయ్యారాన్ని ఒలకబోస్తూ నడుస్తున్నది. నవ్వుతూ, తూలుతూ కబుర్లు చెబుతున్నది. సన్నగా అతిలావున్న శరీరము ఎడమచేతికున్న రిస్టువాచీ, వాంఛా ప్రేమకంగా ఉన్న లేత తమలపాకులవంటి పెదాలు మరి ఇంకా చూస్తున్న కొద్ది రామం పరిపరివిధాల ఆలోచనల్లో మునిగి పోతున్నాడు. అందమయిన పెదాలు కదల్చి రామం వైపు చూస్తూ "ఎక్కడికి" అంది మాలతీ!

రామం బిగ్గరగా నవ్వాడు. బహుశా ఆ నవ్వు సినిమాలోని సంఘటన గురించి అయివుంటుంది.

ఆ ఇంగ్లీషు సినిమాలో హీరో ప్రణయ కోపంలో ఉన్న హీరోయిన్ని బలవంతాన కౌగలించుకొని తనివి తీర ముద్దు పెట్టుకుంటాడు. దాంతో హీరోయిన్ కోపం ఎగిరిపోతుంది. ఆ సంఘటన మాలతీకి బాగా నచ్చింది. చీకటి కావడంచేత జాగ్రత్తగా చూచుకుంటూ ఒకరి ప్రక్కగా ఒకరు అడుగులువేస్తున్నారు. రామం, మాలతీ కాస్సేపట్లో విద్యుద్దీపాలు గల పెద్ద బజారులోకి వచ్చారు.

అక్కడ కాంతివంతముగా పట్టపగలు వలెనేయుంది. అకస్మాత్తుగా మాలతీ దృష్టి ఒక చోట పడి ఆగిపోయింది. కొన్ని క్షణాలపాటు నిలబడిపోయి, గుడ్లప్పగించి చూస్తూ వుండిపోయింది.

అది ఒక షోకేస్ ఆ పట్టణంలోని నగల దుకాణాల కెల్ల పెద్దదయిన ఆ షాపులో చిత్రవిచిత్రాలయిన డిజైనులతో మెరుస్తున్న నగలు ఆ షోకేస్‌లో అమర్చబడియున్నాయి. మాలతీ మనస్సు ఒక్క నిమిషముపాటు చంచలంగా ఊగింది. రామం కూడా అచటే నిలబడి చూస్తున్నాడు.

"ఆ మధ్యలో చూశావా? బాగుంది కదూ!" అంది మాలతీ.

"అదా చాలా న్యూ డిజైన్ మా వాళ్ళ దగ్గర వుంది" మా పెళ్ళప్పుడు చేయించారు. నీకు నచ్చిందా?" అన్నాడు రామం.

అవునన్నట్లు తలవూపింది మాలతి. చిన్నగా నవ్వాడు రామం. అనుకోకుండా రామం చెయ్యిపట్టుకుని ముందుకు అడుగు వేసింది.

రామం పరిస్థితులు తారుమారైనాయి. ప్రేమించుచున్న ప్రియురాలికి ఇప్పుడు ఖరీదైన బహుమతులు ఇచ్చేట్టుగా లేదుపాపం. ఈ మధ్య అతని వ్యాపారము చాలా దెబ్బతింది. వేలకువేలు డబ్బు నష్టపోయాడు. దీనికంతా కారణం మాలతి. కాని రామం ఈ విషయాన్ని గ్రహించలేకపోయాడు. మాలతి ప్రేమలో పడి వ్యాపార పనులన్నీ గుమస్తాల కప్పగించాడు. ఆ గుమస్తాలు ఇదే సమయమనుకొని వేలకువేలు గడించారు. మరి అంతేనా? రామం భార్యతోగూడా కలతలు వచ్చాయి. రామం పరస్త్రీల వెంటతిరిగి వ్యాపారాన్ని అలక్ష్యం చేయడం భార్య తరఫువాళ్ళకి నచ్చలేదు. అతని వ్యాపారము పడిపోయింది. అందుచేత నయానా భయానా చెప్పి చూశారు. ఒక్కమాటలో చెప్పాలంటే వాళ్ళ మధ్యలో పెద్ద గొడవే అయింది. అయినా లాభము లేకపోయింది. కాని రామం భార్య సుధాకుమారి. ఏమైనాసరే మొగుడితో ఉంటానని పట్టుపట్టింది. అందుచే వాళ్ళ వాళ్లు కేకలు వేశారు, బలవంతాన సుధాకుమారిని తీసుకెళ్ళిపోయారు. పోతూపోతూ ఇరువది వేల రూపాయలు విలువచేసే వస్తువులు కూడా తీసుకెళ్ళారు. మరో పదిహేను వేల రూపాయల విలువచేసే వస్తువులు కూడా తీసుకెళ్ళారు. రామంకు ఇచ్చిన ఏబదివేల 'వరకట్నం'నుకూడా అడిగారు. కాని రామం పరిస్థితి......?

అవివున్నా బాగుండును అని చాలాసార్లు అనుకున్నాడు రామం. భార్య అయినావుంటే అవసరానికి ఆదుకునేది.

"నేను నా భార్యని చేసుకుంది డబ్బుకోసమే! లేకపోతే ఆమెలో ఏం చూసి ప్రేమించగలను? నల్లగా పొట్టిగా, అందవిహీనంగా వుంటుంది. నిజంగా ఆమెని వివాహం చేసుకోవడం జీవితంలో నేను చేసిన పెద్ద పొరపాటేనేమో? అనుకుంటాడు, రామం బలిష్టంగా చూపరులని ఆకర్షించే రామంను అందగాళ్ళలోకే లెక్కించవచ్చును.

పెళ్ళయి సరిగ్గా రెండు సంవత్సరాలైనా కాలేదు. రామంకు మాలతీతో వున్న అతని అనుబంధము అంతకంటే పాతది.

తన భార్యయెడల తనుకొంత నిగ్రహంతో ప్రవర్తించి ఉండవలసిందని రామం అనుకుంటాడు, ఆమె గనుక

తన దగ్గరవుంటే తను డబ్బుకి ఇంత కటకట పడాల్సిన అవసరం ఉండేదికాదేమో?

మాలతీ వుంటున్న యిల్లు దగ్గరలోనే వుంది. అయినా వెళ్ళి మాలతీని ఇంటిదగ్గర దిగవిడిచాడు రామం. ఆమె ఇల్లంటే అంత పెద్దదికాదు. మూడు గదుల పోర్షన్, అద్దె వందాపది రూపాయలు. ఆ ఇంట్లో మాలతీతో పాటు ఆమె తండ్రి అనబడే ఒకాయన ఉంటాడు. ఆయన పేరు వేణుగోపాల్.

పైగా చూస్తే రాజకీయ నాయకుడుగా అగపిస్తాడు. ఆయనగారు చేసేపని ఏమిటో ఎవరికీ సరిగా తెలియదు. సిల్కు లాల్చీలు వేస్తాడు. ఎప్పుడూ కాఫీలు త్రాగుతూ విల్స్ సిగరెట్లు కాలుస్తాడు. మాలతీ పూర్వ చరిత్ర అతనికి తెలియదు. ప్రస్తుతము అతను ఆమెకు తండ్రి.

మాలతిని ఇంటిదగ్గర దిగవిడచి వెనక్కి తిరిగి వెళ్ళిపోయేముందు మాలతి దగ్గరకువచ్చి చెవిలో నోరు పెట్టి "నీకు ఆ నెక్లెస్ కావాలని చాలా కోరికగావుందా?" అన్నాడు రామం.

"అవును. కానీ ఎట్లా వీలవుతుంది నీ దగ్గర డబ్బు లేదుగా!" అని నవ్వింది మాలతి. ఆ నవ్వులో ఎంతటివాడినయినా లొంగదీయగల మహత్తర శక్తివుంది.

"కాదు అట్లాంటిదే మా ఆవిడదగ్గరుంది." అన్నాడు రామం.

మాలతి కళ్ళు పెద్దవిచేసి చూసింది. "ఉంటే ఆవిడ ఇవ్వగలదా?"

"ఆ నగలంటే దానికి ప్రాణమే అనుకో కానీ, నేనడిగితే యిస్తుంది. నాపై ప్రేమ. నాకోసం ఏమైనా చేస్తుంది సుధా!"

మాలతి నవ్వింది. 'నాకివ్వ డానికని తెలిసినా ఇస్తుందా ఆమె?"

"ఆఁ" రామం గొంతులో ధీమా.

"చూస్తానుగా" మాలతి మనస్సులో ఆలోచనా తరంగాలు లేచాయి.

"అట్లాగే" అన్నాడు రామం.

ఆ మరునాడు రామం జాడ తెలియలేదు. రెండోనాడూ అతని ఏ సంగతి కూడా తెలియలేదు. అందుచే మళ్ళీ వేణుగోపాల్ ఎవరో లక్షాధికారిని వెంటబెట్టుకొని వచ్చాడు. మాలతికి ఈమధ్య డబ్బు కిబ్బందిగా వుంది.

"ఖర్చులన్నీ భరించి నెలకు రెండు వేలిస్తాడట సరేనన్నాను" అన్నాడు వేణుగోపాల్—

రెండు మూడు రోజులనుంచి మాలతి తీవ్రంగా ఆలోచిస్తుంది. ఆ ఆలోచనలకి కారకుడు రామం. వేణుగోపాల్ చేసిన సూచనకి కాదనకుండా కాస్సేపు వూరుకుంది మాలతి.

"ఏమంటావు?" ఆమె మౌనాన్ని చేయూతగా తీసుకుని తిరిగి రెట్టించాడు వేణుగోపాల్.

"ఎన్నాళ్ళు ఇంకా డబ్బుకోసం ఇబ్బంది పడదాం! నువ్వు సరేనంటే కనకవర్షం కురిపిస్తాడు ఆ లక్షాధికారి."

నీ ఇష్టం మరి...?

మాలతి మాట్లాడలేదు. సందిగ్ధంగా తల వూపింది.

"మరి రామం..."

తనకోసం సర్వస్వం వదిలి పిచ్చాడిలా అయిన రామంను వదిలిపెట్టి ఎట్లా వెళ్ళటం? ఈ దెబ్బకు అతను తట్టుకుని నిలబడగలడా? మోసం చేసిందని ఎన్ని తిట్టుకుంటాడో? ఏమైపోతాడో? అప్రయత్నంగా మాలతి కళ్లు చెమర్చాయి. ఆ మరుసటిరోజు ఆ లక్షాధికారి కారులో వచ్చాడు. మాలతిని తీసుకుని అలా వెళ్ళాడు విహారానికి.

తిరిగి ఇంటికి వచ్చేసరికి సాయంత్రము ఏడుగంటలయింది. అప్పుడే గణగణమని ఫోను మ్రోగింది వెంటనే రిసీవర్ తీసుకుంది. అవతల రామం కంఠం వినిపిస్తుంది.

"హలో మాలతీ! ఆ నెక్లెసు తెచ్చేశాను. నేను స్వయంగా నీ మెళ్ళో అలంకరించాలి."

మాలతి నిరుత్తరురాలయింది.

"ఏమిటి ఆలోచిస్తున్నావు మాలతీ! నీకు ఇంటరెస్టుగా లేదా!"

"ఏం లేదు మీ ఆవిడకి ఈ సంగతి తెలుసా? ఆ నెక్లెస్ నువ్వు నాకివ్వబోతున్నట్లు"—

"ఆఁ నేనే చెప్పాను. మాట్లాడకుండా ఇచ్చింది"

"నిజం?"

"నిజంగా వట్టి అమాయకురాలు. నాతో తనూ వస్తానని గొడవ చేసిందనుకో ఇంతకీ ఏమిటే నీ ప్రోగ్రాం? నేను వస్తున్నాను."

"ప్లీజ్! అయాం వెరీ సారీ! ఇప్పుడు కాదు నాకు పనుంది." ఆ మాట అని ఊపిరి బిగపట్టింది మాలతి.

"మరి...!"

"రేపు సాయంత్రం నాల్గింటికి రా."

"ఓ. కే." నిరుత్సాహం ధ్వనించకపోలేదు రామం గొంతులో_

మాలతి ఆలోచనలో పడింది. చివరికి ఆ ఆలోచనకి అంతు దొరికింది. చీకటిపడే వేళకి వేణుగోపాల్ పలకరింపు—

మరునాడు సాయంత్రం హుషారుగా వచ్చిన రామంకు తాళం వేసియున్న తలుపు స్వాగతం చెప్పింది. రామం తెల్లబోయాడు. అతన్ని చూసి ప్రక్కింటాయన గబగబా వచ్చాడు. రామంకు అతను చిరపరిచిత మిత్రుడే_ వీళ్ళేరి?"

"ఖాళీచేసి వెళ్ళిపోయారు. మళ్ళీ తిరిగిరారట"

"అరె! నాకు తెలియకుండానే.....? అసలేం జరిగింది?"

"ఏమో!"

రామం మంచుగడ్డలా అయిపోయాడు. నోటివెంబ మాటలు రావడంలేదు. రామంను తాకి చూచిన మిత్రుడు అన్నాడు.

"పీడపోయింది. మీ మామగారికి నేను చెబుతాను. వ్యాపారం పెట్టండి మళ్ళీ. శుద్ధ పాపం మీకోసం తెంగ పెట్టుకుంది" అన్నాడాయన.

స్తబ్దుగా కాసేపు అలాగే నిలబడి, ఆలోచనలనుండి తేరుకుని గిరుక్కున వెనుదిరిగాడు రామం. తన ఫాంటు జేబులోని ఆ బంగారు 'నెక్లెస్' ఎంతో బరువుగా తోచిందతనికి.


| | | |
|---|---|---|
| విజ్ఞానానికి | ............ | ఉత్సాహానికి |
| వినోదానికి | ............ | ఉల్లాసానికి |
| వికాసానికి | ............ | ఉత్తేజానికి |

చదవండి ॥

# శ్రీ పద్మాలయ

(తెలుగు సాహిత్య పక్ష పత్రిక)

సంపాదకుడు: జి. ఎస్. కె. సాయిబాబా.

వెల 0-30 పైసలు. సైజు 1/4 డెమ్మీ 12 పేజీలు.

చిన్నవీధి : : అనకాపల్లి - 531001.

(ఆంధ్రప్రదేశ్)

అన్నిచోట్లా సమర్థవంతమైన ఏజెంట్లు కావలెను.

వివరాలకు నేడే వ్రాయండి.